క్లుప్తంగా

కల్వర్టులు నిర్మించాలి



పర్వతగిరి: మండలంలోని కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాలను కలిపే ప్రధాన రహదారిపై కల్వర్టులను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. మండలంలోని కొంకపాక శివాలయం ప్రాంతంలో, గోపనపల్లి చెరువు మత్తడి వద్ద కల్వర్టులను నిర్మించాలని కోరుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో కల్వర్టులు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని, తద్వారా రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు వాపోయారు. కల్వర్టులు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డైరీ ఆవిష్కరణ



గీసుకొండ: జిల్లా పశు వైద్యాధికారులు సంఘం 2024 డైరీని కలెక్టర్‌ ప్రావీణ్య బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేడీ డాక్టర్‌ బాలకృష్ణ, పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ వడ్డేపల్లి రమేశ్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వల్లెరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్‌ వడ్డేపల్లి సోమశేఖర్‌, కోశాధికారి డాక్టర్‌ రాజేందర్‌, సంయుక్త కార్యదర్శి డాక్టర్‌ ఝాన్సీ, డాక్టర్‌ శ్రీనివాస్‌, డాక్టర్‌ మంజిలాల్‌ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



దుగ్గొండి: మండలంలోని పొనకల్‌ గ్రామ మాజీ సర్పంచ్‌ కొత్తకొండ శారద గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ మేరకు బాధితురాలిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నర్సంపేట బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కొత్తకొండ చంద్రమౌళి, రవివర్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


నవీన్‌ (ఫైల్‌)

నల్లబెల్లి: పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఆసరవెల్లిలో జరిగింది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూనావత్‌ నవీన్‌ (27) తనకున్న ఎకరం భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగు కోసం రూ.5లక్షలు అప్పు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో పంట దిగుబడిరాలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై ఈనెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు నర్సంపేటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కల్పన, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కల్పన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌ మల్లారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు చివరి తేదీ ఉండగా దాన్ని 30వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్‌ జిల్లా అల్గునూర్‌ విద్యాసంస్థ, గౌలిదొడ్డి బాలికల విద్యాసంస్థ (సీఓఈ)లో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్‌ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.tswreis.ac.inలో సంప్రదించాలని తెలిపారు.

సంత వేలం వాయిదా

పరకాల : 2024–2025 ఆర్థిక సంవత్సరానికి మేకలు, పశువుల సంతకు సీల్డుటెండర్‌, బహిరంగ వేలం నిర్వహించగా సరైన వేలం రాకపోవడంతో ఈ నెల 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు పరకాల మున్సిపల్‌ కమిషనర్‌ నర్సింహా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ వేలంలో పాల్గొనాల్సినవారు ఈనెల 29వ తేదీన సాయంత్రం 5గంటల్లోపు డీడీని కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మున్సిపల్‌ పాలన అస్తవ్యస్తం

- పన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ పాలనలో లేదు

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్‌ పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అధికారులకు తాము ఆడిందే ఆట అన్నచందంగా సాగుతోంది. తాగునీరు అందక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. పన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాల కల్పనలో లేకపోవడంతో పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలనే తపనే తప్ప తాగునీరు, డ్రెయినేజీ నిర్వహణ, లీకేజీలకు మరమ్మతులు చేపట్టడంలో శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులకు తమ పదవులు కాపాడుకోవడంలో ఉన్న శ్రద్ధ పాలనలో లేకుండా పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్ధన్నపేట డాక్టర్‌ రవీందర్‌రెడ్డి వీధితోపాటు పిరంగి గడ్డ ప్రాంతంలో చాలా వరకు కాలనీల్లో మూడు రోజులకు ఒకమారు తాగునీరు రావడంలేదని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. పిరంగిగడ్డ ప్రాంతంలో గత వారం రోజులుగా తాగునీరు పైపులు లీకై నల్లా నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. ఒక వైపు నీరు వృథాగా పోతున్నా.. మరోవైపు తాగునీరు అందకున్నా.. ఎవరూ సమస్యను ఎవరూ పరిష్కరించడంలేదని పేర్కొంటున్నారు. సుమారు ఐదు రోజులుగా చెత్తను తరలించకపోవడంతోపాటు డ్రెయినేజీలను శుభ్రం చేయడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీల్లో మురుగు నీరు నిలిచి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కేవలం జిల్లా ఉన్నతాధికారులు తమకు పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని ఇచ్చారని తాము ఇతర పనులు ఏమి చేయలేమని చేతులు ఎత్తి వేశారు. దీంతో వర్ధన్నపేట పట్టణంలో తాగునీరు లేక, డ్రెయినేజీల్లో మురుగు నీరు నిలిచి ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. పిరంగి గడ్డ వద్ద ఉన్న నల్లా జంక్షన్‌ వద్ద గత వారం రోజులుగా నీరు వృథాగా పోతుందని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తాము ఏమి చేయలేమని చెప్పారని.. కాలనీ వాసులు వాపోతున్నారు.


పిరంగిగడ్డ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్‌ అధికారులు పన్నుల వసూళ్లలో చూపిస్తున్న శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో చూపడంలేదు. మా కాలనీకి తాగునీరు నాలుగు రోజులకు ఒకసారి వస్తోంది. దీంతో నీటి గోస తప్పడంలేదు. డ్రెయినేజీల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త తరలింపులో అదే నిర్లక్ష్యం.. దీంతో ఎన్నో ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు.. త్వరగా పరిష్కరించాలి.

– గద్దం యాదగిరి, వర్ధన్నపేట

బ్రిడ్జి పనులు నాణ్యతగా చేపట్టాలి


పనులు పరిశీలిస్తున్న సంఘం నాయకులు

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి దిక్షకుంట్ల గ్రామానికి వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని తెలంగాణ రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు అందె లక్ష్మీనారాయణ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం రైతు కూలి సంఘం ప్రతినిధుల బృందం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉప్పరపల్లి నుంచి దిక్షకుంట్ల గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఉప్పరపల్లి గ్రామ శివారులో చెరువు నుంచి వచ్చే వరదతో రోడ్డుపై వేసిన పైపులు కొట్టుకుపోతున్నాయన్నారు. దీంతో రెండు గ్రామాల గుండా పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం రోడ్డు కోతకు గురవుతుందన్నారు. రోడ్డు పనులుచేస్తున్న కాంట్రాక్టర్‌ గతంలో మాదిరిగా పైపులు వేసి రోడ్డు పనులు చేపట్టి చేతులు దులుపుకుందామని చూస్తున్నాడని ఆరోపించారు. శాశ్వత వంతెన నిర్మాణ పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సంఘం నాయకులు అందె మార్కండేయ, చింతకింది ఐలయ్య, వీరన్న, గణేష్‌ ఉన్నారు.

సర్వర్‌ సతాయిస్తోంది..


పింఛన్‌ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

ఖానాపురం: పింఛన్‌ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు. నిత్యం సర్వర్‌ మొరాయిస్తుండటంతో పింఛన్‌ల కోసం గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈక్రమంలో మండలంలోని బుధరావుపేట గ్రామంలో బుధవారం పింఛన్‌ల కోసం వృద్ధులు, దివ్యాంగులు తదితరులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేచి ఉన్నారు. పోస్టల్‌ అధికారి ఆలస్యంగా రావడం ఒక సమస్య అయితే వచ్చిన తర్వాత సర్వర్‌ మొరాయింపు మరో సమస్యగా పరిణమించింది. ప్రతీసారి నెలా ఇదే పరిస్థితి ఉంటుందని, ఎదురుచూపులు తప్పడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- పూజలు చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దుగ్గొండి: మండలంలోని కేశవాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈమేరకు ఉదయం నిత్యారాధన, ద్వారతోరణం కార్యక్రమం నిర్వహించి శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వరస్వామికి ఆలయంలోని కోనేరులో చక్రస్నానం అనంతరం తీర్థప్రసాద గోష్టి నిర్వహించి ఉత్సవాలు ముగించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి– సునంద దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంది తిరుపతిరెడ్డి–పూలమ్మ, జితేందర్‌రెడ్డి–సరళ, మనోహర్‌రెడ్డి–కృష్ణవేణి, సురేందర్‌రెడ్డి–లక్ష్మీ, ఆలయ ఈఓ కిరణ్‌కుమార్‌, జితేందర్‌, అర్చకులు దేశికస్‌చార్యులు, సాగర్‌స్వామి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కొనసాగుతున్న కొమ్మాల జాతర

- రేపు స్వామివారి రథోత్సవం
- తరలివస్తున్న భక్తులు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల జాతర కొనసాగింది. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయ అర్చకులు నిత్యనిధి, సేవలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 29న స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శేషగిరి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. రాత్రి 10గంటలకు స్వామివారు, అమ్మవార్లను రథంపై ప్రతిష్ఠించి గుట్టచుట్టూ తిప్పనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఏర్పాటుచేసి హుండీల్లోని కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ వెల్లడించారు.


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు విష్ణు


కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి రథం (ఫైల్‌)

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి పారువేట


విద్యుద్దీపాల వెలుగుల్లో ఆలయం


చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాయపర్తి: మండలంలోని కొండాపురం గ్రామంలో నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పారువేట కార్యక్రమంలో భాగంగా ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను తిప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



రాయపర్తి: మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన చిన్నపాక పూజ పురిటినొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది వాహనంలో సిబ్బంది పూజను వర్ధన్నపేట ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో నొప్పులు ఎక్కువఅయ్యాయి. దీంతో అంబులెన్స్‌ ఈఎంటీ కృష్ణ, పైలట్‌ హరీశ్‌లు వాహనంలోనే పురుడుపోశారు. పూజ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రసవం అనంతరం వర్ధన్నపేట సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా 108 వాహన సిబ్బందికి పూజ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌

ఖానాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్‌ అన్నారు. ఈ మేరకు మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎంసీపీఐ(యూ) ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిరాయింపుల్లో కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు కేసీఆర్‌ను మించిపోయారన్నారు. కష్టపడి పని చేసిన నాయకులకు కాకుండా నూతనంగా చేరిన వారికి పట్టంకట్టడం బాధాకరమన్నారు. ప్రజావ్యతిరేక చట్టాలను సపోర్ట్‌ చేసే బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు, ఎన్నికల కమిషన్‌ నియామకం, మద్దతు ధర చట్టం తీసుకురావడం, కార్మిక వ్యతిరేక చట్టాలు తేవడంలో బీజేపీ ఇష్టారీతిన వ్యవహరిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించే కాంగ్రెస్‌, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి, పాటిబండ్ల హరిబాబు, కొంరయ్య, ఎలీషా, రాఘవులు, నర్సయ్య పాల్గొన్నారు.

అప్పల్‌రావుపేటలో మట్టి దందా..

- అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు

నెక్కొండ: కొందరు దళారులు మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో రాత్రి సమయాల్లో కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ శివారులోని గుట్టను ఆనవాళ్లు లేకుండా విచ్చలవిడిగా తవ్వకుంటూ మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది వాపోతున్నారు. అక్రమంగా వెలుస్తున్న రియల్‌ ఎస్టేట్‌ భూములకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ మట్టి దందాకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతోపాటు తవ్వకాలకు వినియోగిస్తున్న యంతారలను సీజ్‌ చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.


మట్టి తవ్విన ప్రదేశాన్ని చూపుతున్న గ్రామస్తులు

ఎంబీబీఎస్‌ ఫలితాల్లో శ్రుతి ప్రతిభ


తాటికొండ శ్రుతి

నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన తాటికొండ యాదయ్య కుమార్తె తాటికొండ శ్రుతి ఎంబీబీఎస్‌ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఆర్‌వీఎం మెడికల్‌ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించి ఇటీవల ఎంబీబీఎస్‌ పూర్తి చేసింది. మంగళవారం వెలువడిన ఎంబీబీఎస్‌ ఫలితాల్లో శ్రుతి ఉత్తీర్ణత సాధించింది. డాక్టర్‌ వృత్తి అంటే ఎంతో ఇష్టమని, నాన్న యాదయ్య తనను వైద్య వృత్తి వైపు ప్రోత్సహించి చదివిస్తున్నారని తెలిపారు. జీవితంలో మరిన్ని పై చదువులు చదివి పేదలకు వైద్యం అందించడమే ధ్యేయమని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు యాదయ్య, జ్యోతి దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూయూ డిపో నాయకుడు గొలనుకొండ వేణు, డిపో ఉద్యోగులు అభినందించారు.

సిద్ధాంత గ్రంథాలు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలి


బాబురావును సన్మానిస్తున్న వల్స పైడి

హన్మకొండ కల్చరల్‌: పరిశోధక విద్యార్థులు సమర్పించే సిద్ధాంత గ్రంథాలు భావితరాల విద్యార్థులకు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్‌ భుక్యా బాబురావు సూచించారు. హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో బాబురావు అధ్యక్షతన బుధవారం జరిగిన పరిశోధక విద్యార్థి వల్స పైడి పరిశోధన చేసిన 'తెలంగాణలో మాల ఉపకులాల సామాజిక సాంస్కృతిక జీవితం – సాహిత్య పరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ ప్రీ–సబ్‌మిషన్‌ సెమినార్‌ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌ భుక్యా బాబురావును వలస పైడి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ శ్రీమంతుల దామోదర్‌, డాక్టర్‌ చూరెపల్లి రవికుమార్‌, డాక్టర్‌ బాసని సురేష్‌, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్‌ అసిస్టెంట్‌ డాక్టర్‌ గంపా సతీష్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ ఈసెట్‌ వాయిదా వేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

రామన్నపేట: పాలిటెక్నిక్‌ విద్యార్థులు ఇంజనీరింగ్‌కు వెళ్లడానికి నిర్వహించే టీఎస్‌ ఈసెట్‌ –2024 పరీక్షను వెంటనే వాయిదా వేయాలని ఏబీవీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్‌ చేశారు. ఏబీడీఎస్‌ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్‌ విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్‌ మూడవ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్‌ 25నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు ఉన్నాయని, అవి కాగానే స్వల్ప వ్యవధిలోని ఏప్రిల్‌ 6న ఈసెట్‌ పరీక్ష ఉందని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులకు ఆ పరీక్షకు సిద్ధం కావడానికి కేవలం 5రోజుల సమయమే ఉందని వాపోయారు. అంత తక్కువ సమయంలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కాలేరని తెలిపారు. పరీక్షలు ముగిసిన అనంతరం రెండు వారాల సమయం కేటాయించి ఈసెట్‌ పరీక్ష నిర్వహించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌, రేవంత్‌, కీర్తన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోన్‌ ట్యాపింగ్‌పై విచారణ చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌ రెడ్డి

హన్మకొండ: ఫోన్‌ ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌లో బీజేపీ వరంగల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. సీబీఐ ద్వారానే సమగ్ర విచారణ సాధ్యమని, అప్పుడే ఫోన్‌ ట్యాపింగ్‌లోని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ ఒక్కటే అని చెప్పిన కాంగ్రెస్‌ పార్టీ.. ఇప్పుడు సీబీఐతో విచారణకు ఆదేశించడం లేదంటే ఆ పార్టీలన్నీ ఒక్కటే అని విమర్శించారు. నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. వరంగల్‌లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌ మార్తినేని ధర్మారావు, వరంగల్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌ వి.మురళీధర్‌, వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌, మాజీ మేయర్‌ డాక్టర్‌ టి.రాజేశ్వర్‌ రావు, వరంగల్‌ పార్లమెంట్‌ కన్వీనర్‌ తాళ్లపల్లి కుమారస్వామి, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గురుమూర్తి శివకుమార్‌, రావుల కిషన్‌, రత్నం సతీష్‌ షా, మురళీధర్‌ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతరలో భక్తుల రద్దీ

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజు గురువారం రాత్రి భక్తులు తాకిడి ఎక్కువగా కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు సమర్పించారు. ప్రత్యేక దర్శనం వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ సిరిసిల్ల రాజయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో రాజయ్యకు స్వాగతం పలికారు. విశ్వక్సేనా ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం నిర్వహించారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

'అయోధ్య'కు భజన మండలి సభ్యులు



శాయంపేట : అయోధ్య బాలరాముడు, శ్రీకాశీ విశ్వేశరస్వామి సన్నిధి, త్రివేణి సంగమం యాత్రకు మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి, శ్రీ వేంకటేశ్వర భజన మండలి బృందం బుధవారం బయలుదేరారు. మాందాటి రాజు, పులి ఆంజనేయులు, రాజన్న, హనుమంతక్క, రాజమణి, శ్రీనివాస్‌ వెళ్లినవారిలో ఉన్నారు.